రక్షణ రంగానికి దన్నుగా తెలంగాణ

ఏరోస్పేస్, డిఫెన్స్ పెట్టుబడులకు గమ్యస్థానంగా హైదరాబాద్.. బీఆర్ఎస్ హయాంలోనే అనేక కంపెనీలు ఏర్పాటు

హైదరాబాద్, మే 10 (నమస్తే తెలంగాణ): దేశ రక్షణ రంగానికి తెలంగాణ వెన్నుదన్నుగా నిలుస్తున్నది. బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రం, ముఖ్యంగా హైదరాబాద్ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల పెట్టుబడులకు గమ్యస్థానంగా మారడంతో ఇక్కడ అనేక జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు కొలువుదీరాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం గుర్తించిన 14 ప్రాధాన్య రంగాల్లో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు చోటు కల్పించడంతో పాటు నాటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ అనుసరించిన పారిశ్రామిక అనుకూల విధానాలే ఇందుకు కారణమని చెప్పవచ్చు. ప్రస్తుతం ఎల్ అండ్‌టీ డిఫెన్స్, వెమ్ టెక్నాలజీస్, టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, జీఈ, కోలిన్స్ ఏరోస్పేస్, టాటా బోయింగ్ ఎరోస్పేస్, టాటా సికోర్‌స్కై ఏరోస్పేస్, స్కైరూట్ ఏరోస్పేస్, శాఫ్రాన్, ధృవ స్పేస్, ఎంటీఏఆర్ టెక్నాలజీస్, లాక్‌హీడ్ మార్టిన్, ఆజాద్ ఇంజినీరింగ్ తదితర 20కిపైగా కంపెనీలు ఇక్కడ కార్యకలాపాలు సాగిస్తున్నాయి. దీంతో క్షిపణులు, పలు రకాల ఆయుధాలతోపాటు డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాలకు అవసరమైన అనేక రకాల పరికరాలు, విడిభాగాల తయారీకి తెలంగాణ ప్రధాన కేంద్రంగా ఎదిగింది.

తెలంగాణలో తయారవుతున్న తేలికపాటి ఆయుధాలు

ప్రభుత్వ రంగంలోని బీడీఎల్ సంస్థ చాలా కాలం నుంచి క్షిపణులతోపాటు పలు రకాల ఆయుధాలను ఉత్పత్తి చేస్తుండగా.. ప్రైవేటు రంగంలోనూ అనేక రకాల తేలికపాటి ఆయుధాలు తయారవుతున్నాయి. వాటిలో మిషన్-ప్రూవెన్ కార్ 816 రైఫిల్, కార్ 817 అసాల్ట్ రైఫిల్, తేలికపాటి సీఎస్ఆర్ 338, 308 బోల్ట్-యాక్షన్ స్నైపర్ రైఫిల్స్, సీఎస్ఆర్ 50 బోల్ట్-యాక్షన్ యాంటీ-మెటీరియల్ స్నైపర్ రైఫిల్, అత్యాధునిక సీఎంపీ 9 సబ్ మెషీన్ గన్, క్యారకల్ ఈఎఫ్, క్యారకల్ ఎఫ్ జెన్-2 కంబాట్ పిస్టల్స్ ముఖ్యమైనవి.

రాష్ట్రంలో ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల అభివృద్ధి ఇలా..

- హైదరాబాద్‌లో జీఎంఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో ఏరోసిటీని ఏర్పాటు చేశారు. ఈ ఏరోస్పేస్ ఇండస్ట్రియల్ పార్క్‌లో విమానాలతోపాటు రక్షణ రంగానికి అవసరమైన పలు రకాల ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు తయారవుతున్నాయి.
- ఆదిభట్లలో ఏర్పాటు చేసిన ఏరోస్పేస్ ఎస్ ఈజెడ్‌లో టాటా గ్రూప్‌తోపాటు అమెరికన్ సంస్థ సికోర్‌స్కై కలిసి హెలికాప్టర్ క్యాబిన్లు, సీ-130జే ఎంపెనేజ్‌లు, ఎఫ్-16 వింగ్‌లను తయారు చేస్తున్నాయి.
- విమాన ఇంజిన్ల తయారీకి అవసరమైన విడిభాగాలను జీఈ సంస్థ ఉత్పత్తి చేస్తున్నది.
- హైదరాబాద్‌లో ఏవియేషన్ యూనివర్సిటీ ఏర్పాటు కోసం గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం క్రాన్‌ఫీల్డ్ యూనివర్సిటీతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాలకు సంబంధించిన ఉన్నత విద్యను బోధించేందుకు ఈ వర్సిటీ దోహదపడుతుంది.
- ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో దిగ్గజాలుగా ఖ్యాతి పొందిన లాక్‌హీడ్ మార్టిన్, టాటా గ్రూప్, జీఎంఆర్ లాంటి సంస్థలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టాయి. దీంతో హైదరాబాద్‌లో ఈ రంగానికి అవసరమైన పటిష్టమైన పర్యావరణ వ్యవస్థ ఏర్పాటైంది.
- ఏరోస్పేస్ రంగానికి సంబంధించి 2018, 2020, 2022లో తెలంగాణ జాతీయస్థాయిలో ఉత్తమ అవార్డులను గెలుచుకోవడం రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగం అభివృద్ధికి నిదర్శనంగా చెప్పవచ్చు.
- డిఫెన్స్, ఏరోస్పేస్ రంగాల్లో దేశ పురోభివృద్ధి కోసం హైదరాబాద్‌లోని డీఆర్‌డీవో, డీఆర్‌డీఎల్, ఆర్‌సీఐ, బీడీఎల్, ఎండీఎన్ లాంటి సంస్థలు అనేక పరిశోధనలు నిర్వహిస్తున్నాయి.
- దేశ రక్షణ రంగంలో కీలకపాత్ర పోషించే చిన్న ఆయుధాల తయారీ కేంద్రాన్ని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గ్రూప్ ఇటీవలే ప్రారంభించింది.

ప్రహ్లాద్ విజన్‌తోనే 'ఆకాశ్' డిజైన్

- ఆకాశ్ మిసైల్ వెనుక ప్రహ్లాద్ విశేష కృషి
- డిజైన్ రూపకల్పనలో ఆయన కీలక పాత్ర
- హైదరాబాద్ బీడీఎల్‌లోనే రూపాంతరం
- పాక్ డ్రోన్ దాడులకు 'ఆకాశ్'తోనే చెక్
- దేశీ పరిజ్ఞానంతోనే డీఆర్‌డీవో అభివృద్ధి

హైదరాబాద్, మే 10(నమస్తే తెలంగాణ): తాజా ఉద్రిక్తతల వేళ భారత్‌పై పాకిస్థాన్ ప్రయోగిస్తున్న డ్రోన్లు, ఆకాశ బాంబులన్నీ గాలిలోనే పేలిపోతున్నాయి.. పాక్ ప్రయత్నాలన్నింటికీ భారత్ తన రక్షణ వ్యవస్థతో చెక్ పెడుతున్నది. ఇదంతా రష్యా నుంచి కొనుగోలు చేసిన ఎస్-400తోపాటు భారత్ తన సొంత నైపుణ్యంతో అభివృద్ధి చేసిన 'ఆకాశ్' మిసైల్ కూడా రక్షణ కవచంగా నిలుస్తున్నది. పాక్ బాంబులను తుత్తునీయలు చేస్తున్నది. ఇలాంటి అత్యున్నత రక్షణ వ్యవస్థను భారత ఆర్మీకి అందించిన కీలక వ్యక్తి ప్రహ్లాద్ రామారావు. 15 ఏండ్ల క్రితం డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్‌డీవో)లో రామారావు నేతృత్వంలో ఆకాశ్ మిస్సైల్ పురుడు పోసుకున్నది. దీన్ని పూర్తి స్వదేజీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశారు. అయితే దీన్ని హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) తయారు చేయడం గమనార్హం. భూమిపై నుంచి అకాశంలో దాడి చేసే విధంగా దీన్ని రూపొందించారు. 25-30 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని కూడా ఇది ఛేదిస్తుంది. ఇందులో భాగంగానే పాక్ ప్రయోగించిన డ్రోన్ బాంబులన్నింటినీ భారత ఆర్మీ ఆకాశ్ మిసైల్ ద్వారానే గాలిలోనే నిలువరించి పేల్చేసింది. వాస్తవానికి ఎస్-400తోపాటు ఆకాశ్ మిసైల్ ఇంతటి సమర్థవంతంగా పని చేయకపోయింటే తాజా పరిస్థితుల్లో భారత్‌కు గడ్డు పరిస్థితులు ఉండేవని రక్షణరంగ నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. పాక్ సైన్యం డ్రోన్లు, హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లతో పశ్చిమ భారత్ రాష్ట్రాలపై విరుచుకుపడింది. కానీ ఎస్-400, ఆకాశ్ మిస్సైల్‌ను వినియోగించి ఈ రాష్ట్రాలను పాక్ దాడుల నుంచి సైన్యం కాపాడింది.

అబ్దుల్ కలాం మెచ్చిన శాస్త్రవేత్త

ప్రహ్లాద్ రామారావు 1947 ఫిబ్రవరి 5న బెంగళూరులో జన్మించారు. మద్రాస్‌లో పాఠశాల విద్యను అభ్యసించిన ప్రహ్లాద్.. విశ్వేశ్వరయ్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. ఆ తర్వాత బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ నుంచి పీజీ పూర్తిచేశారు. హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూ నుంచి రాకెట్స్, మిస్సైల్ సిస్టమ్‌లో పీహెచ్‌డీ పూర్తిచేశారు. ఆ తర్వాత 1971లో విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్‌లో ఉద్యోగంలో చేరారు. హైదరాబాద్‌లోని డీఆర్‌డీఎల్‌లోనూ పని చేశారు. పలు పరిశోధనల్లో కీలకంగా వ్యవహరించిన ప్రహ్లాద్ రామారావు అంచలంచెలుగా ఎదిగి 2005లో డీఆర్‌డీవోలో చీఫ్ కంట్రోలర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా ఎదిగారు. అప్పుడే ఆకాశ్ మిస్సైల్ తయారీకి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి. ఆకాశ్ ప్రాజెక్టుకు ప్రహ్లాద్ రామారావు ప్రాజెక్టు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అయితే ప్రహ్లాద్ పనితీరును గమనించిన మిస్సైల్ మ్యాన్, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కాలం ఆయన్ను ప్రోత్సహించారు. ఆ ప్రోత్సహంతో ప్రహ్లాద్ రామారావు విజయవంతంగా ఆకాశ్‌ను అభివృద్ధి చేశారు. ఇదొక్కటే కాదు పృథ్వీ, అగ్ని, నాగ్ మిస్సైళ్ల తయారీలోనే ప్రహ్లాద్ రామారావు కీలకంగా వ్యవహరించడం విశేషం.

నా బేబీ పనితీరుపై గర్వంగా ఉన్నది

తన నేతృత్వంలో రూపొందించిన ఆకాశ్ మిస్సైల్ పాక్‌తో యుద్ధంలో అద్భుత పనితీరు కనబర్చుతుండటంపై ప్రహ్లాద్ రామారావు హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఓ జాతీయ మీడియాతో తన ఆనందాన్ని పంచుకున్నారు. 'నా బేబీ అంచనాలకు మించి పనిచేస్తూ శత్రుదేశాన్ని నిలువరించడం గర్వంగా ఉన్నది' అని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి ఆకాశ్ టెక్నాలజీని తీసుకునేందుకు తొలుత భారత సైన్యం నిరాకరించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. ఎట్టకేలకు భారత సైన్యం అమ్ముల పొదిలో చేరి శత్రు దేశానికి చుక్కలు చూపిస్తుండటంపై ఆనందం వ్యక్తం చేశారు.

వీర జవాన్ మురళికి కన్నీటి వీడ్కోలు

- కల్లితండాలో అధికార లాంఛనాలతో అంతిమ సంస్కారాలు
- అంత్యక్రియలకు మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్ హాజరు

హైదరాబాద్ మే 10 (నమస్తే తెలంగాణ): తల్లిదండ్రులు, బంధువులు, ఆత్మీయులు, ప్రజానీకం అశ్రునయనాల మధ్య... యూరీ ఉగ్రదాడిలో వీరమరణం పొందిన తెలుగు జవాన్ మరళీనాయక్ అంత్యక్రియలు శనివారం సాయంత్రం ముగిశాయి. మురళి భౌతికకాయాన్ని అంబులెన్స్‌లో బెంగళూరు నుంచి కల్లితండాకు తరలించారు. దేశసేవ కోసం వెళ్లి, శవపేటికలో విగతజీవిగా తిరిగివచ్చిన కొడుకును చూసి తల్లిదండ్రులు శ్రీరామ్ నాయక్, జ్యోతిబాయి హృదయవిదారకంగా రోదించారు. వేలాదిమంది మురళి పార్థివదేహంపై పూల మాలలు వేసి నివాళులర్పించారు. పోలీసులు, జవాన్లు గాల్లోకి కాల్పులు జరిపారు. అనంతరం సంప్రదాయబద్ధంగా కార్యక్రమాలు పూర్తిచేశారు. మురళీనాయక్ అంత్యక్రియలకు మహారాష్ట్ర మంత్రి ఉదయ్ సామంత్ హాజరయ్యారు. మురళీనాయక్ తల్లిదండ్రులతో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్‌షిండే వీడియోకాల్‌లో మాట్లాడారు. ఘాట్‌కోపర్‌లో మురళీనాయక్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు.

మురళీ.. ఇక మాకెవరు దిక్కు!

'మురళీ.. మమ్మల్ని అనాథలను చేసి ఎక్కడికె ళ్తివిరా.. రెక్కలు ముక్కలుజేసి పెంచితిమి గదరా.. నువ్వు దేశ సేవ కోసం సైన్యంలో చేరితే గర్వపడ్డాం. నువ్వు చవుకుని మమ్మల్ని చూసుకుంటావని ఆశపడితే ఎంత అన్యాయం చేస్తివి. నువ్వు లేని లోకంలో మేం బతికేదెట్ల..?' అంటూ అమర జవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరామ్, జ్యోతినాయక్ కన్నీటిపర్యంతమయ్యారు. తమ అబ్బాయి దేశం కోసం పోరాడి అమరుడు కావడం గర్వంగా ఉన్నదని అన్నారు. తల్లి జ్యోతిబాయి మాట్లాడుతూ "మురళి మొన్న వీడియోకాల్ జేసి మాట్లాడాడు. నేను బాగున్నా.. మీరు ఎట్లున్నారని అడిగాడు. ఇంతలోనే ఒక్కగానొక్క కొడుకు కానరానిలోకానికి వెళ్లిపోయాడు" అని బోరునవిలపించారు.

ఇద్దరు జవాన్ల వీరమరణం

- మరో ఏడుగురికి గాయాలు
- ఎల్వోసీ వెంబడి పాక్ కాల్పులు
- జమ్ముకశ్మీర్ అధికారి సహా మొత్తం ఏడుగురి మృతి

ఇంతియాజ్, పవన్‌కుమార్

జమ్ము/పఠాన్‌కోట్: సరిహద్దు జిల్లాల్లో పాక్ సైన్యం కవ్వింపు చర్యలు కొనసాగుతున్నాయి. శనివారం జరిపిన మోర్టార్ షెల్లింగ్, డ్రోన్ దాడుల్లో ఇద్దరు జవాన్లతో సహా ఏడుగురు మృతి చెందారు. గాయపడిన వారిలో ఏడుగురు బీఎస్ఎఫ్ సిబ్బంది ఉన్నారు. పాక్ దాడులతో భయం నీడలో గడుపుతున్న కశ్మీర్‌లోని మూడు జిల్లాల ప్రజలు తమ ఇళ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు తరలుతున్నారు. పాక్ షెల్స్ ఇండ్లు, ప్రభుత్వ భవనాలపై పడుతుండటంతో బారాముల్లా, బండిపొరా, కుప్వారాకు చెందిన దాదాపు 1.10 లక్షల మంది తమ ఇండ్లను వదిలి సురక్షిత ప్రాంతాలకు వెళ్లినట్టు అధికారులు తెలిపారు.

- పూంఛ్ సెక్టార్‌లోని కృష్ణ ఘాటి సమీపంలోని తన పోస్టు సమీపంలో శనివారం ఉదయం జరిగి ఫిరంగి దాడిలో హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన సుబేదార్ మేజర్ పవన్ కుమార్ అమరులయ్యారు.
- ఆర్ఎస్ పురా సెక్టార్‌లో పాక్ జరిపిన కాల్పుల్లో ఓ బీఎస్ఎఫ్ జవాన్ మృతిచెందగా, మరో ఏడుగురు గాయపడ్డారు.
- రాజౌరీలో అడిషనల్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కమిషనర్ రాజ్‌కుమార్ థాపా అధికారిక నివాసంపై జరిగిన ఫిరంగి దాడిలో ఆయన మృతి చెందారు.
- రాజౌరీ పట్టణంలోని పారిశ్రామిక ప్రాంతంలో పాకిస్థాన్ షెల్లింగ్ కారణంగా రెండేళ్ల ఐషా నూర్, మహ్మద్ షోహిబ్ (35) మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డారు.
- పూంచ్ జిల్లాలోని కంఫ్రూ-గల్‌హుట్టా గ్రామంలో ఓ ఇంటిని మోర్టార్ గుండు తాకడంతో 55 ఏండ్ల రషీదాబీ ప్రాణాలు కోల్పోయింది.
- పాక్ కాల్పుల్లో ఆర్ఎస్ పురాలోని బిడీ పూర్ జట్టా గ్రామానికి చెందిన అశోక్ కుమార్ అలియాస్ షోకి మృతి చెందాడు.
- జమ్ము శివారు ప్రాంతంలోని ఖేరి కెరన్ గ్రామంలో పాకిస్థాన్ షెల్లింగ్ కారణంగా జాకీర్ హుస్సేన్ (45) మరణించగా, ఓ బాలిక సహా ఇద్దరు గాయపడ్డారు.

కశ్మీర్‌లో 3 డ్రోన్ల కూల్చివేత

శ్రీనగర్: కశ్మీర్ లోయలోని ముఖ్యమైన ప్రాంతాలపై డ్రోన్ దాడులకు ప్రయత్నించిన పాకిస్థాన్‌కు భంగపాటు ఎదురైంది. భారత భద్రతా దళాలు శనివారం మూడు డ్రోన్లను కూల్చివేశాయి. తొలుత శ్రీనగర్‌లోని ఓల్డ్ ఎయిర్‌ఫీల్డ్‌పై ఎగురుతున్న డ్రోన్‌ను ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థ కూల్చివేసింది. అలాగే పట్టాన్‌లోని హైదర్‌బేగ్ ప్రాంతంలో సెక్యూరిటీ ఇన్‌స్టాలేషన్ సమీపంలో ఎగురుతున్న రెండు డ్రోన్లను భద్రతా బలగాలు కూల్చివేశాయి.

పోలీస్ స్టేషన్‌లో రైతు ఆత్మహత్యాయత్నం

- తన భూమిని వేరే వారు కబ్జా చేస్తే తననే స్టేషన్‌కు పిలిపిస్తున్నారని మనోవేదన
- నల్లగొండ జిల్లా గుర్రంపోడులో ఘటన

గుర్రంపోడ్, మే 10: భూ వివాదం నేపథ్యంలో పోలీసులు తననే స్టేషన్‌కు పిలిపిస్తున్నారని మనస్తాపానికి గురైన ఓ రైతు శనివారం నల్లగొండ జిల్లా గుర్రంపోడు పోలీస్ స్టేషన్ ఆవరణలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. బాధితుడి కథనం ప్రకారం.. గుర్రంపోడు మండలం కొప్పోలుకు చెందిన ఐతరాజు రమేశ్‌కు గ్రామంలోని సర్వే నంబర్ 524లో 2.20 ఎకరాల భూమి ఉన్నది. పట్టా కూడా ఆయన పేరిటే ఉన్నది. సదరు భూమిని వేరేవారు అనుభవిస్తున్నారు. ఈ వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరింది. అయితే భూమిపై హక్కు తమకే ఉన్నా, పోలీసులు తమనే తరుచూ స్టేషన్‌కు పిలిపిస్తున్నారని, తమకు న్యాయం జరుగడం లేదని మనస్తాపానికి గురైన రమేశ్ శనివారం పోలీస్ స్టేషన్ ఆవరణలోనే పురుగుల మందు తాగాడు. అడ్డుకున్న పోలీసులు హుటాహుటిన అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండ దవాఖానకు తరలించారు.

బ్లాక్‌మెయిల్ చేసేందుకే..

తాము 35 ఏండ్లుగా అనుభవిస్తున్న భూమిలో రమేశ్ దౌర్జన్యంగా గడ్డి వాము వేసి ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాడని గోలి రేణుక ఫిర్యాదు చేసినందున.. అతడిని స్టేషన్‌కు పిలిపించినట్టు ఎస్సై పసుపులేటి మధు తెలిపారు. దౌర్జన్యంగా వేసిన గడ్డి వాములు తొలగించాలని, భూమికి సంబంధించి హక్కు పత్రాలు తెచ్చుకుని సర్వేయర్లతో రాళ్లు పాతించుకోవాలని సూచించినట్టు పేర్కొన్నారు. కానీ అతను బ్లాక్‌మెయిల్ చేసేందుకే పురుగుల మందు తాగే ప్రయత్నం చేసినట్టు తెలిపారు.

- ధాన్యం తరలించాలని రోడ్డెక్కిన రైతులు

ధాన్యం కొనుగోలులో సర్కారు నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శనివారం వనపర్తి జిల్లా శ్రీరంగాపురం, పెబ్బేరు మండలాలకు చెందిన రైతులు శ్రీరంగాపురంలోని కొల్లాపూర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని తూకం వేసి నాలుగైదు రోజులైనా లారీలు లేక మిల్లులకు తరలించడంలో జాప్యం జరుగుతున్నదని ఆరోపించారు. తూకమైన వడ్లకు తరుగు పేరిట నాలుగైదు కిలోలు తగ్గిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తాము నష్టపోతున్నామని ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. దాదాపు గంటపాటు చేపట్టిన ఆందోళనతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. - పెబ్బేరు

అకాల వర్షానికి తడిసిన ధాన్యం

- పలు జిల్లాల్లో కురిసిన వర్షం
- పిడుగుపాటుకు హమాలీ మృతి
- పెద్దపల్లిలో నేలకొరిగిన చెట్లు.. విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నమస్తే నెట్‌వర్క్, మే 10 : అకాల వర్షం రైతన్నను తీవ్రంగా దెబ్బతీసింది. ఉమ్మడి వరంగల్‌తోపాటు పెద్దపల్లి జిల్లాలో శనివారం సాయంత్రం కురిసిన వానకు ధాన్యం తడిసిముద్దయింది. జనగామ జిల్లా కొడకండ్ల మార్కెట్‌లో ఆరబోసిన ధాన్యం తడిసింది. జఫర్‌గఢ్ మండలం తిమ్మంపేటలోని కొనుగోలు కేంద్రంలో ధాన్యం నీటిపాలైంది. వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. ధాన్యం కొనుగోలు కేంద్రంలో పనిచేస్తున్న హమాలీ కార్మికుడు బిట్టు (30)పై పిడుగుపడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కాగా పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు, ధర్మారం మండలంలోని పలు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవగా, కొంత ధాన్యం కొట్టుకుపోయింది. భారీ వర్షానికి పలు చోట్ల చెట్లు పడిపోగా రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. బలమైన ఈదురుగాలులతో జిల్లా కేంద్రంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో విద్యుత్తు సరఫరా పూర్తిగా నిలిచిపోయింది.

పెద్దపల్లి కొనుగోలు కేంద్రంలో కొట్టుకుపోయిన ధాన్యాన్ని కుప్పలా చేస్తున్న రైతులు

ఇప్పటికి రాలిన మట్టిపూలు 493

మరో రైతు ఆత్మహత్య

- బిగుబడులు లేక.. అప్పుల భారం మోయలేక
- మనస్తాపంతో బలవన్మరణం
- సిద్దిపేట జిల్లాలో విషాదం

దుబ్బాక, మే 10 : దిగుబడులు రాక.. చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లాలో చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అక్బర్‌పేట-భూంపల్లి మండలం చిట్టాపూర్‌కు చెందిన రైతు గంగాల పరశురాములు (40) తనకున్న ఎకరన్నర వ్యవసాయ భూమిలో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సాగుకు చేసిన అప్పులు పెరిగిపోవడంతోపాటు సరైన దిగుబడులు రాకపోవడంతో మానసికంగా కలత చెందాడు. జీవితంపై విరక్తి చెందిన ఆయన శుక్రవారం రాత్రి ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు శనివారం ఉదయం పొలం వద్దకు వెళ్లి చూడగా, చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా వేలాడుతూ కనిపించడంతో భోరున విలపించారు. పరశురాములు భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు భూంపల్లి పోలీసులు తెలిపారు.

పండించిన ధాన్యం సాక్షిగా.. మళ్లీ కేసీఆర్ రావాలంటున్న నిర్మల్ జిల్లా రైతులు

మళ్లీ కేసీఆర్ రావాలి.. మీరే మా బాధలు తీర్చాలి

కొనుగోలు కేంద్రం వద్ద రైతుల కన్నీళ్లు.. రైతుని రాజు చేసిన గొప్ప నేత కేసీఆర్

నిర్మల్ జిల్లా వానల్‌పాడ్ రైతుల భావోద్వేగం

భైంసా టౌన్, మే 10 : ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే నిర్వాహకులు ఇబ్బందులు పెడుతున్నారని నిర్మల్ జిల్లా భైంసా మండలం వానల్‌పాడ్ రైతులు ఆందోళన చెందుతున్నారు. కేసీఆర్ పాలనలో కొనుగోలు కేంద్రాలు బాగా నడిచాయని రైతులు రాజు, సాయన్న, గౌతం గుర్తుచేసుకుంటున్నారు. తమ బాధలు తీర్చడానికి కేసీఆర్ మళ్లీ రావాలంటూ భావోద్వేగానికి లోనయ్యారు. పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకొస్తే, తేమ శాతం ఉన్నా ధాన్యాన్ని కొనుగోలు చేయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన చెందుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డి సర్కార్ అమలు చేయడం లేదని విమర్శించారు. కేసీఆర్ కోసం తాము ప్రాణాలైన ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని వారు చెప్తున్నారు. నాలుగైదు రోజులుగా సాయంత్రం పూట గాలిదుమారంతో కూడిన జల్లులు పడుతుండటంతో ధాన్యం తడిచిపోతుందేమోనని ఆందోళన చెందుతున్నట్టు వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని కోరారు.

వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గీలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్థులు

ఇందిరమ్మ రాజ్యమా? ఇంటి దొంగల రాజ్యమా?

- ఇందిరమ్మ ఇండ్లు కాంగ్రెస్ కార్యకర్తలకేనా?
- అధికారులను నిలదీసిన వికారాబాద్ జిల్లా జీవన్గీ వాసులు
- వెనుదిరిగిన సర్వే అధికారులు

బషీరాబాద్, మే 10: కాంగ్రెస్ కార్యకర్తలకే ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తారా? అంటూ వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం జీవన్గీ గ్రామస్థులు అధికారులను నిలదీశారు. ఇందిరమ్మ రాజ్యమా? ఇంటి దొంగల రాజ్యమా? అని మండిపడ్డారు. శనివారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వేలో భాగంగా ఏపీవో పద్మారావు, పంచాయతీ కార్యదర్శి ప్రకాశ్ గ్రామంలో ఆరా తీస్తుండగా ఇండ్లు ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎలా గుర్తిస్తారని స్థానికులు నిలదీశారు. గ్రామానికి చెందిన బషీరాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి కనుసన్నల్లో ఎంపిక ప్రక్రియ జరిగిందంటూ ఆరోపించారు. తమకు అర్హత లేదా? అని స్థానికులు ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు, కార్యకర్తలకు ఇందిరమ్మ ఇండ్లు కేటాయించడమేమిటని ప్రశ్నించారు. కిరాయి ఇండ్లలో ఉంటూ కష్టాలు పడుతున్న తాము కన్పించడం లేదా? అని నిలదీశారు. దీంతో అధికారులు సర్వే ప్రక్రియను నిలిపివేసి వెళ్లిపోయారు.

- తరుగు పేరుతో మిల్లర్ల దోపిడీ

తరుగు పేరుతో మిల్లర్లు నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపిస్తూ రైతులు శనివారం వనపర్తి జిల్లా గోపాల్‌పేట బస్టాండ్ సమీపంలోని రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పదిరోజులుగా లారీల కొరత ఉండటంతో ధాన్యం కొనుగోలు చేయడంలేదని, రైస్ మిల్లర్లు తరుగు, తాలు పేరుతో క్వింటాకు 3 కిలోలపైగా తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా సివిల్ సప్లై అధికారి విశ్వనాథం వచ్చి రోజుకు 5 లారీలు పంపిస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు. - గోపాల్‌పేట

- ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా

ధాన్యం కొనుగోలు చేయాలంటూ కామారెడ్డి జిల్లా బీబీపేట్ మండలం తుజాల్‌పూర్‌లో శనివారం రైతులు ధర్నా చేపట్టారు. వడ్లను కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తున్నారని, తరలించిన ధాన్యాన్ని రైస్‌మిల్లుల్లో అన్‌లోడింగ్ చేయడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. లారీలను అందుబాటులో ఉంచి, కొనుగోళ్లను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సై ప్రభాకర్ చేరుకొని రైతులను అధికారులతో మాట్లాడించి ఆందోళన విరమింపజేశారు. - బీబీపేట్